
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 16 డిసెంబరు | 2024



చిత్రాభినందనలు



అమలాపురం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లకే ప్రపంచ చెస్ చాంపియన్‌గా అవతరించిన తెలుగుతేజం ఇండియన్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్‌కు అభినందనలు తెలుపుతూ పాలగుమ్మి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహచంద్రకుమార్ వాటర్ కలర్స్ గుకేష్ చిత్రాన్ని గీసి చిత్రాభినందన తెలిపారు.



పోలవరానికి సీఎం చంద్రబాబు

ఉదయం 10.50 గంటలకు పోలవరం సందర్శనకు సీఎం చంద్రబాబు ఆర్‌అండ్‌ఆర్, భూసేకరణపై సమీక్ష

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఉదయం పది గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.45గంటలకు పోలవరం ప్రాజెక్టు వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ఆయనకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలుకుతారు. 10.50 గంటలకు బయల్దేరి పోలవరం ప్రాజెక్టు సైట్‌లోకి వెళతారు. 12.05 గంటల వరకు గ్యాప్-1, వైబ్రో కాంపాక్షన్, గ్యాప్-2 పనులను పరిశీలించి డయాఫ్రంవాల్ వద్ద పరిస్థితిని పరిశీలిస్తారు. అక్కడి నుంచి బయల్దేరి 12.20 గంటలకు పోలవరం గెస్టహౌస్‌కు చేరుకుంటారు. 12.50 గంటల వరకు పోలవరం ఆర్‌అండ్‌ఆర్, భూసేకరణ పరిస్థితిపై సమీక్షిస్తారు. మధ్యాహ్నం 1.15 గంటల వరకు మీడియా సమావేశం నిర్వహిస్తారు. 1.25 గంటలకు హెలికాప్టర్లో బయల్దేరి 2.15 గంటలకు వెలగపూడిలోని సెక్రటేరియట్‌కు చేరుకుంటారు.

ఇక్కడి నుంచే షెడ్యూల్ ప్రకటన?

ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడానికి అవసరమైన షెడ్యూల్‌ను చంద్రబాబు ఇక్కడి నుంచే ప్రకటించే అవకాశం ఉంది. రాష్ట్ర విభజన తర్వాత 2014లో సీఎం హోదాలో చంద్రబాబు పోలవరం పనులను పరుగులు పెట్టించిన సంగతి తెలిసిందే. ప్రతి సోమవారం పోలవరం వచ్చేవారు. 2019కి సుమారు72 శాతం పనులు పూర్తి చేయించారు. స్పిల్‌వే గేట్లు కూడా పెట్టి ఒక కొలిక్కి తెచ్చారు. ఎగువ కాఫర్ డ్యామ్, డయాఫ్రంవాల్‌లను నిర్మించారు. దిగువ కాఫర్ డ్యాం పనులు మొదలుపెట్టారు. కుడి ప్రధాన కాలువ పనులను ఒక కొలిక్కి తేగా, ఎడమ ప్రధాన కాలువ పనులు కూడా పరుగులు పెట్టించిన సంగతి తెలిసిందే. మరోపక్క పోలవరం విద్యుత్ ప్రాజెక్టు పనులను కూడా మొదలు పెట్టించారు. కానీ 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో రివర్స్ టెండరింగ్, ఎంక్వయిరీలు అంటూ జాప్యం చేసి, చివరకు ప్రాజెక్టును కదలకుండా చేసిన సంగతి తెలిసిందే.

● (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి):

కూటమి రాకతో..చిగురించిన ఆశలు

2019కు ముందు ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రం నలుమూలల నుంచి సందర్శకులను రప్పించి ప్రాజెక్టు పనులు చూపించారు. వైసీపీ ప్రభుత్వంలో కనీసం మీడియా కూడా పోలవరం ప్రాజెక్టు చూడ్డానికి వెళ్తే అనేక నిబంధనలు విధించేవారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి భారీ మెజార్టీతో అధికారం లోకి రావడంతో పాటు తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై ఆశలు చిగురించాయి. కేంద్రం కూడా తోడవ్వడంతో ప్రాజెక్టు త్వరగా పూర్తవుతుందనే నమ్మకం ఏర్పడింది.

వైసీపీ హయాంలో అస్తవ్యస్తం

వైసీపీ హయాంలో ఏమి జరిగిందో కానీ డయాఫ్రంవాల్ దెబ్బతింది. ఇవాళ దీనికి సమాంతరంగా కొత్త డయాఫ్రంవాల్ నిర్మించనున్నారు. గతనెలలో నిపుణుల కమిటీ పర్యటించి డయాఫ్రంవాల్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అమెరికా, కెనడా నిపుణులతో కలసి పీపీఏ, సీడబ్ల్యూసీ, జలవనరుల శాఖ అధికారులు, ఇతర నిపుణులు కలిసి గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దెబ్బతిన్న డయాఫ్రంవాల్‌కు సమాంతరంగా మరో డయాఫ్రంవాల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. నాలుగు రోజుల పాటు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి డయాఫ్రంవాల్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణం, డిజైన్లు, మెటీరియల్ ఏమి వాడాలి, టెస్ట్‌లు ఎలా చేయాలనే దానిపై పోలవరం ప్రాజెక్టు వద్ద వర్క్ షాపు నిర్వహించిన సంగతి తెలిసిందే. చివరిరోజు రాజమహేంద్రవరంలోని మంజీరా ఇంటర్నేషనల్ హోటల్‌లో నిపుణుల కమిటీ ఫైనల్ మీటింగ్ జరిగింది. సుమారు 4గంటల సమయం పాటు అక్కడ నిపుణులు, అధికారులు, కాంట్రాక్టర్, కన్సల్టెన్సీ నిపుణులు చర్చించారు. ప్రస్తుతం ఉన్న డయాఫ్రంవాల్‌కు 6 మీటర్ల దూరం నుంచి సమాంతరంగా కొత్త డయాఫ్రంవాల్ నిర్మించనున్నారు. దీని డిజైన్లు, వాడవలసిన మెటీరియల్స్, వాటి నాణ్యత ఎలా ఉండాలి. ఎటువంటి టెస్ట్‌లు నిర్వహించాలనే అంశంపై చర్చ జరిగింది. అఫ్రీ కన్సల్టెన్సీ డిజైన్, మెటీరియల్స్ నాణ్యత వివరాలపైనా చర్చించారు. డయాఫ్రంవాల్ పనులు జనవరి నుంచి మొదలు కానున్నాయి. పనుల షెడ్యూలును చంద్రబాబు స్వయంగా ఇక్కడే ప్రకటించే అవకాశం ఉంది. డయాఫ్రంవాల్ పనులు మొదలెట్టిన తర్వాత ప్రధాన డ్యామ్ ఈసీఆర్ఎఫ్ పనులు మొదలుపెట్టి 2027కు పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు వెళ్లనున్నారు.



టమాట, వంకాయ తోబుట్టువులు

ఒకే మొక్కకు రెండు రకాలు..

(ఆలమూరు, ఆంధ్రజ్యోతి): మొక్క ఒకటే కాని పంట రెండు రకాలు.. ఇదేమిటని ఆశ్చర్యపోతున్నారా.. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరులో మతుకుమిల్లి కరుణాకర్‌బాబు ఇంటి పెరట్లో ఓ మొక్కకు టమాట, వంకాయలు ఒకేసారి కాస్తున్నాయి. టమాట మొక్క కణజాలం లేదా చిగురును వంగ మొక్కలోకి గ్రాఫ్టింగ్ పద్ధతిలో ఏకం చేసి అంటుకట్టి 18రోజులు నీడలో ఉంచారు. దీంతో ఒకే మొక్కగా పెరిగి టమాట, వంకాయలు కాస్తున్నాయి. ఇజ్రాయిల్‌లో ఈ రకంగా గ్రాఫ్టింగ్ చేసి పంటలను అధికంగా పండిస్తుంటారని కరుణాకర్‌బాబు చెప్పారు. ఒకే మొక్కకు టమాట, వంకాయలు పండుతుండడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఒకే జాతికి చెందిన రెండు రకాల కూరగాయల మొక్కలను గ్రాఫ్టింగ్ చేయడం వల్ల ఈవిధంగా దిగుబడులు సాధించవచ్చునని కొత్తపేట ఉద్యానవనశాఖ అధికారి కోటేశ్వరరావు తెలిపారు.

తండ్రిని హతమార్చిన పెంపుడు కొడుకు

సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో దారుణం

7లో



నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి ఔన్నత్యాన్ని కాపాడిన ఘనత అమరజీవి పొట్టి శ్రీరాములుకు దక్కుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి నాంది పలికి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ఆమరణ దీక్ష నిర్వహించి ఆత్మార్పణ చేసిన అమరజీవిగా శ్రీరాములు చరిత్రలో నిలిచిపోయారన్నారు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగాన్ని స్మరించుకుంటూ ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పితామహుడిగా ఆయన నిలిచారన్నారు. మహాత్మాగాంధీ ప్రభావంతో శ్రీరాములు ఉప్పు సత్యాగ్రహం క్విట్ ఇండియా ఉద్యమంతో సహా ప్రధాన స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొని ఎన్నో ఏళ్లు జైలు శిక్ష అనుభవించారన్నారు. తెలుగు మాట్లాడే ప్రజలందరికీ ఒక రాష్ట్రం ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో శ్రీరాములు ఆమరణ దీక్ష చేశారన్నారు. జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ టీవీ ప్రసాద్ మాట్లాడుతూ 1952లో మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ శ్రీరాములు 58 రోజులు ఆమరణ దీక్ష చేసి ఆత్మార్పణ చేసుకున్నారన్నారు. రాష్ట్రం కోసం ప్రాణాలొదిలిన తొలి వీరుడిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, సిబ్బంది రవికిరణ్, భరత్, వెనుకబడిన తరగతుల వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి పాటుపడాలి

అమలాపురం టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు ఏ ఆశయ సాధనకు ప్రాణాలను సైతం తృణప్రాయంగా విడిచిపెట్టారో గుర్తించి ఆ మహనీయునికి నిజమైన నివాళులు అర్పించేలా ప్రతీ ఒక్కరూ తెలుగుజాతి అభ్యున్నతికి తెలుగు భాషాభివృద్ధికి పాటుపడాలని సినీ సంగీత దర్శకుడు సాలూరు వాసూరావు పిలుపునిచ్చారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ఆదివారం రాత్రి అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతిని సమైక్యభారతి, పశ్చిమబెంగాల్ తెలుగుజాతి ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. సమైక్య భారతి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నల్లా పవన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో తొలుత వాసూరావు ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి అమరజీవికి ఘనంగా నివాళులర్పించారు. సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, గిడుగు నాగేశ్వరరావు, ఎం.విజయపాల్, డాక్టర్ గోదశి గంగరాజు, డాక్టర్ నల్లా సత్యనారాయణ అమరజీవి చేసిన సేవలను, త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, నాయకులు నంబూరి సత్యనారాయణమూర్తి, ఆర్.కిశోర్, కె.గౌరీనాయుడు, రామకృష్ణశ్రీవత్స, వేదనభట్ల సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ముందుగా శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని సాలూరు రాజేశ్వరరావు, పెండ్యాల నాగేశ్వరరావు సంగీత నిర్వహణలో ఘంటశాల వెంకటేశ్వరరావు ఆలపించిన గీతాలను ప్రముఖ గాయకులు ధవల సర్వేశ్వరరావు, శ్యామ్‌ప్రసాద్, జయచంద్ర, కరక రాజబాబు, ప్రియాపావని, సుశీల ఆలపించారు. మానవుడే మహనీయుడు అంటూ ఆలపించిన గీతాన్ని పొట్టిశ్రీరాములుకు అన్వయిస్తూ వక్తలు ప్రసంగించడం విశేషం.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సంగీత దర్శకుడు వాసూరావు

పాఠశాలల్లో విధివిధానాలు

తప్పక పాటించాలి

జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా



అమలాపురం టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పాఠశాల ప్రారంభ సమయానికి కనీసం ఐదు నిమిషాల ముందు హెచ్ఎం, ఉపాధ్యాయులు విధిగా హాజరు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా సూచించారు. పాఠశాల పూర్తి అయిన తర్వాత విద్యార్థులంతా పాఠశాల నుంచి బయటకు వెళ్లారని నిర్ధారించుకున్న తర్వాతే ఉపాధ్యాయులు ఇంటికి బయలుదేరాలన్నారు. జిల్లాలోని డీవైఈవో, ఎంఈవో, హెచ్ఎంలకు డీఈవో సలీంబాషా ఆదివారం ప్రత్యేకంగా పలు సూచనలు జారీ చేశారు. ప్రతీరోజు పాఠశాల అసెంబ్లీ సమయంతో పాటు ఖాళీ పిరియడ్‌లో విద్యార్థులకు నైతిక విలువలను ప్రత్యేకంగా బోధించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చినప్పుడు మాత్రమే వారిని అత్యవసర పరిస్థితుల్లో బయటకు పంపించాలన్నారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు ఉపాధ్యాయులు సమీపంలోని ఆసుపత్రులకు తీసుకువెళ్లాలన్నారు. పాఠశాల ప్రాంగణాల్లోని శిథిల భవనాలకు వద్దకు విద్యార్థులు వెళ్లకుండా నిరోధించాలన్నారు. ప్రతీ పాఠశాలలో గ్రంథాలయాల నుంచి విద్యార్థులు పుస్తకాలు తీసుకుని చదువుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సంబంధిత రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం తీసుకునే విద్యార్థుల శాతం పెంచడంతో పాటు విద్యార్థులు ప్రతీరోజు ఏకరూపు దుస్తులు, షూలు ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడా ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచి ఆటలు ఆడించాలన్నారు. ఆటల పోటీలను ప్రోత్సహించాలన్నారు. పీఎంశ్రీ పాఠశాలల్లో ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ల సేవలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు వృత్తి విద్య అందించాలన్నారు. పాఠశాలలో కిచెన్ షెడ్ల ఉంచి టాయిలెట్లు, క్లాస్‌రూములు పరిశుభ్రంగా ఉంచాలని డీఈవో సూచించారు.

మెట్టు మెట్టుకు పూజలు

7లో

అన్నవరంలో ఘనంగా మెట్లోత్సవం

శెట్టిబలిజ కులాల అభివృద్ధికి.. కూటమి ప్రభుత్వం 'వెన్నుదన్ను'



ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

- మంత్రులు సుభాష్, దుర్గేష్
- కార్పొరేషన్ చైర్మన్, సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించిన రెడ్డి సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ కులాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం 'వెన్నుదన్ను'గా నిలుస్తోందని మంత్రులు సుభాష్, దుర్గేష్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం లాలాచెరువు సెంటర్‌లో శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. రాత్రి జరిగిన వెన్నుదన్ను సభలో శెట్టిబలిజ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా కుడుపూడి సత్తిబాబు, 15మంది సభ్యులతో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రమాణం చేయించారు. సభలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, కార్మిక శాఖ మంత్రి సుభాష్, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి సహా పలువురు ప్రసంగించారు. పూర్తి వివరాలు.. 7లో..

రూ.65 కోట్లతో అమలాపురం అభివృద్ధి

అమలాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణానికి అన్ని రంగాల్లోను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు వెల్లడించారు. పట్టణంలో ఏడు ప్రాంతాల్లో వారధుల నిర్మాణం, రోడ్ల విస్తరణ, డివైడర్ల నిర్మాణం కోసం ఇప్పటికే రూ.65 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పించినట్టు చెప్పారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన అల్లాడ స్వామినాయుడు స్వగృహంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడారు. చైర్మన్ అల్లాడ స్వామినాయుడుతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన అమలాపురం పట్టణంలో ఇప్పటి వరకు అభివృద్ధి ఆనవాళ్లు కనిపించడంలేదని, రానున్న రోజుల్లో పట్టణ స్వరూపాన్ని మార్చి రోడ్లు, డ్రైన్ల విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ట్రాఫిక్ సమస్యను నిరోధించడానికి మూడు ముఖ్య ప్రాంతాల్లో వంతెనలు నిర్మించాల్సిన దృష్ట్యా వాటికి ప్రాధాన్యత ఇచ్చి త్వరలోనే పనులు చేపడతామని స్పష్టం చేశారు. ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అముడా చైర్మన్ అమలాపురం పట్టణానికి చెందిన సీనియర్ టీడీపీ నేత అల్లాడ స్వామినాయుడును నియమించడానికి సహకరించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, ప్రధాన కార్యదర్శి లోకేశ్‌లకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

18న అముడా చైర్మన్ ప్రమాణం..

అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు ఈ నెల 18వ తేదీన స్థానిక కాపు కల్యాణ మండపంలో పదవీ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌లతో పాటు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, పార్టీ అధినేతలు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు హాజరు కానున్నారు. కార్యక్రమానికి కూటమి నేతలు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని స్వామినాయుడు కోరారు. విలేఖరుల సమావేశంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, పార్టీ నేతలు దెందుకూరి సత్తిబాబురాజు, జంగా అబ్బాయివెంకన్న, దున్నాల దుర్గ, గోకరకొండ హరిబాబు, నల్లా చిట్టిబాబు పాల్గొన్నారు

వేట్లపాలెం.. రక్తసిక్తం



సంఘటనా ప్రాంతంలోనే దాడికి ఉపయోగించిన కత్తి

- ముగ్గురు మృతి.. ఏడుగురికి తీవ్ర గాయాలు
- ఇంటి సరిహద్దు విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం
- కత్తులు, గొడ్డళ్లతో ఒక వర్గంపై మరొక వర్గం దాడి
- సామర్లకోట మండలం వేట్లపాలెం శివారులో ఘటన

వేట్లపాలెం రక్తసిక్తమైంది.. ఇంటి స్థలం సరిహద్దు వివాదం.. పెను విషాదానికి దారి తీసింది. ఒక వర్గం మరొక వర్గంపై చేసిన దాడిలో మూడు నిండు ప్రాణాలు బలవ్వగా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామ శివారులోని దళిత చెరువు ప్రాంతంలో ఆదివారం రాత్రి ఈ దారుణం జరిగింది.

పూర్తి వివరాలు.. 7లో..



సంఘటనాస్థలం వద్ద కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్

గీత కులాలకు కూటమి అధిక ప్రాధాన్యం

» మంత్రి వాసంశెట్టి సుభాష్ » రాజమహేంద్రవరంలో శెట్టిబలిజ వెన్నుదన్ను సభ » పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు



శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లతో ప్రమాణం చేయిస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం, పాల్గొన్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గీత కులాలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అధిక ప్రాధాన్యమిచ్చారని కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. తూర్పు గోదావరి రాజమహేంద్రవరం లాలాచెరువులో శెట్టిబలిజ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, 15 మంది డైరెక్టర్ల ప్రమాణస్వీకారోత్సవం, శెట్టిబలిజ వెన్నుదన్ను సభ శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం (ఆర్‌ఎస్) అధ్యక్షతన ఆదివారం రాత్రి జరిగింది. కుడుపూడి సత్తిబాబు, 15మంది డైరెక్టర్‌లతో ఆర్‌ఎస్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ శెట్టిబలిజ జాతి పిత దొమ్మేటి వెంకటరెడ్డి కాంస్య విగ్రహాన్ని రాజమహేంద్రవరం లాలాచెరువు సెంటర్‌లో ఆవిష్కరించడం చాలా ఆనందంగా ఉందని, వేమగిరి సెంటర్లో కూడా దొమ్మేటి విగ్రహాన్ని పెట్టుకుంటామన్నారు. గీత కులాలకు కూటమి ప్రభుత్వ సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 5నెలలోనే లిక్కర్ పాలసీలో 10శాతం రాయితీ ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం శెట్టిబలిజ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేస్తే చంద్రబాబు సీఎం అయ్యాక కార్పొరేషన్లను బలోపేతం చేసి నిధుల కేటాయింపులు చేస్తున్నారన్నారు. శెట్టిబలిజలను తెలంగాణలో ఓసీలుగా పరిగణిస్తున్న తరుణంలో తమ సీఎం చంద్రబాబు దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామన్నారు.

శెట్టిబలిజల అభివృద్ధికి కృషి : దుర్గేష్

మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ శెట్టిబలిజల అభివృద్ధికి చైర్మన్, డైరెక్టర్లు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయంగా కొంతమందికి అవకాశాలు వస్తాయని, కుడుపూడి సత్తిబాబు, డైరెక్టర్లు జాతి ప్రయోజనం కోసం కృషి చేయాలన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అమరావతిని, పోలవరాన్ని చంద్రబాబు కచ్చితంగా పూర్తి చేస్తారని చెప్పారు. ఎమ్మెల్యే, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఇటు పార్టీ కార్యక్రమాల్లో, అటు జాతి కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ కుడుపూడి చేసిన కృషికి తగిన గుర్తింపు లభించిందన్నారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించి గీత కులాలకు అనాడే ఎన్టీఆర్ ప్రాధాన్యత ఇచ్చారని దానిని సీఎం చంద్రబాబు ముందుకు తీసుకెళ్లి మరింతగా అభివృద్ధికి పాటుపడ్డారని చెప్పారు. తెలంగాణ శెట్టిబలిజ సంఘం నేతలు జయప్రకాష్‌నారాయణ, కొప్పి శెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణలో ఓసీలుగా ఉన్న శెట్టిబలిజలను బీసీలుగా మార్పించడంలో కూటమి ప్రభుత్వం చొరవచూపి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందించారు. రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్పొరేషన్లకు నిధులు-విధులు లేకుండా నిర్వీర్యం చేస్తే చంద్రబాబు తగిన ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయిస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ శెట్టిబలిజ గౌడ, శ్రీశ యన, యాత కులాల అభివృద్ధికి పాటుపడింది టీడీపీయే అని గుర్తు చేశారు.

శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను గజమాలతో శెట్టిబలిజ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సభలో టీడీపీ నేతలు యర్రా వేణుగోపాలరాయుడు, పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ బుడ్డిగ రవి, కడలి రామకృష్ణ, పిల్లి శ్యామ్, సింహా నాగమణి తదితరులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న శెట్టిబలిజలు

వేట్లపాలెం... రక్తసిక్తం



ముగ్గురి హత్యకు దారి తీసిన ఇల్లు

» ముగ్గురు మృతి.. ఏడుగురికి తీవ్ర గాయాలు
» ఇంటి సరిహద్దు విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం
» కత్తులు, గొడ్డళ్లతో ఒక వర్గంపై మరొక వర్గం దాడి
» సామర్లకోట మండలం వేట్లపాలెం శివారులో ఘటన

సామర్లకోట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం సరిహద్దు వివాదంలో ఇరు వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలు ముగ్గురు వ్యక్తుల దారుణ హత్యకు దారి తీసింది. మరో ఏడుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో విద్యుత్ సబ్ స్టేషన్ వెనుక ఇంటి నిర్మాణం వద్ద జరిగింది. ఘర్షణలకు దారి తీసిన ఇరువర్గాలూ ఒకే సామాజిక వర్గానికి చెందిన దళితులు కావడం గమనార్హం. గ్రామ శివారులో దళిత చెరువును ఆక్రమించి కార్థాల కుటుంబానికి చెందిన వ్యక్తులు ఇల్లు నిర్మిస్తున్నారని సమీపంలోనే ఉంటున్న బచ్చల కుటుంబానికి చెందిన వారు గ్రామ పంచాయతీలో ఫిర్యాదులు చేశారు. ఈ వివాదం ఆ 2 కుటుంబాల మధ్య 3నెలలుగా నడుస్తోంది. గ్రామ పెద్దల మధ్య కూడా పలు దఫాలు చర్చలు నిర్వహించారు. అయితే కార్థాల కుటుంబానికి చెందిన వ్యక్తులు ఆదివారం ఇంటి నిర్మాణంలో భాగంగా సుమారు 15మంది కూలీలతో కలిసి శ్లాబ్ వేస్తుండగా ఇదే అదనుగా చూసుకుని బచ్చల కుటుంబానికి చెందిన వ్యక్తులు సుమారు పది మంది మూకుమ్మడిగా కత్తులు, ఇనుపరాడ్‌లతో ఒక్కసారిగా దాడులు చేసి విచక్షణ రహితంగా నరికారు. దీంతో కార్థాల ప్రకాశరావు(55) సంఘటనా స్థలిలోనే తీవ్ర రక్తస్రావంతో ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడిన వారిని ప్రైవేట్ అంబులెన్స్‌లో సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కార్థాల చంద్రరావు(60) మృతిచెందాడు. ఉన్నత చికిత్స నిమిత్తం మిగిలిన వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ కార్థాల ఏసుబాబు(45) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో కార్థాల పండు, కార్థాల దావీదు, కార్థాల బాబీ, కార్థాల చిన్నోడు, కార్థాల సత్యవేణి, కార్థాల అచ్చియ్య, కార్థాల సంజీవరావులు ఉన్నారు. వారిలో ఒకరి పరిస్థితి విషయంగా ఉన్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి వర్గాల ద్వారా సామర్ల కోట పోలీసులకు తెలిసింది.

కాగా ఈ దాడులకు పాల్పడిన వారిగా బచ్చల సుబ్బారావు, బచ్చల జకరయ్య, బచ్చల బిక్షప్పి, బచ్చల మోషే, బచ్చల భాగ్యవతిలను పోలీసులు ప్రాథమికంగా గుర్తించి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటనా సమాచారం అందిన వెంటనే పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ శ్రీ కృష్ణభగవాన్ తదితర పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనా స్థలికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేరుకుని ఘర్షణలకు దారి తీసిన పరిస్థితులపై, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి గురించి ఆరా తీశారు. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు.



సంఘటనా స్థలంలో మృతిచెందిన ప్రకాశరావు

పోలీసుల విఫలం!

ఇదిలా ఉండగా 2 కుటుంబాల మధ్య వివాదం గత 3 నెలలుగా పంచాయతీలో ఫిర్యాదులు పరంపరగా నడుస్తుండడం, గ్రామ పెద్దల మధ్య రాజీ చర్చలు నిర్వహించడం వంటి కీలక సమాచారాన్ని సేకరించడంలో పోలీసు వర్గాలే కాదు ఇంటిలిజెన్స్ వర్గాలు సైతం విఫలం కావడం వల్లే రెండు కుటుంబాల మధ్య కత్తులతో దాడులు, ముగ్గురి హత్యకు దారితీసిందని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో 2018లో ఇదే ప్రాంతంలో దళితులకు, దళితులేతరులకు పట్టాలుగా దళిత చెరువులో అప్పట్లో వివాదం చెలరేగి 15 ఇళ్లు తగులబెట్టిన విషయం విధితమే.



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పండు, సంజీవరావు



కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి ప్రమాణ స్వీకారంలో ప్రసంగిస్తున్న మంత్రి దుర్గేష్

కౌడా చైర్మన్ తుమ్మల ప్రమాణ స్వీకారం

ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దుర్గేష్

సర్పవరం జంక్షన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డవలెప్‌మెంట్ అథారిటీ (కౌడా) చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం కాకినాడలోని ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులో జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి కం దుల దుర్గేష్ మాట్లాడుతూ కాకినాడ పరిసర ప్రాంతాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కౌడా నిధులతో మరింత అభివృద్ధి చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. రామస్వామి సేవలకు గుర్తింపుగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రతిష్టాత్మక కౌడా చైర్మన్ పదవి ఇచ్చి గౌరవించారన్నారు. రామస్వామి మాట్లాడుతూ కౌడా నిధులతో బీచ్‌లో ఏర్పాటు చేసిన యుద్ధ విమాన మ్యూజియాన్ని జనవరిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కౌడా పరిధిలోని ప్రాంతాల అభివృద్ధి కి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో చైర్మన్ బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఇతర ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు య నమల రామకృష్ణుడు, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చిన రాజప్ప, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, వనమాడి కొండబాబు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ హరిప్రసాద్, టీడీపీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు జ్యోతులనవీన్, చిలుకూరి రామ్‌కుమార్, డిడ్కో చైర్మన్ వి.అజయ్, సివిల్ సరఫరా చైర్మన్ తోట సుధీర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెట్టు మెట్టుకు పూజలు

● సత్యదేవుడి సన్నిధిలో వేడుకగా మెట్లోత్సవం
● పసుపు, కుంకుమలు పూసేందుకు తరలివచ్చిన మహిళలు





సత్యదేవుని సన్నిధిలో పోటాపోటీగా మెట్లకు పసుపు, కుంకుమలు పూస్తున్న మహిళలు, పల్లకీలో పూజలందుకున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం మెట్లోత్సవ కార్యక్రమం అత్యంత వేడుకగా జరిగింది. ఉదయం 7 గంటలకు కొండపై నుంచి స్వామి,అమ్మవార్లను పల్లకీలో కొండదిగువకు తీసుకునివచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. 9.30కి తొలిపావంచా వద్ద పల్లకీలో స్వామి,అమ్మవార్లకు ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం స్వామివారి అష్టోత్తరశతనామాలతో పూజలు నిర్వహించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం తొలిమెట్టు వద్ద ఈవో సుబ్బారావు హారతులివ్వగా మహిళలు పసుపు, కుంకుమలతో మెట్టు మెట్టుకు పూశారు. ముందు పల్లకీలో స్వామిఅమ్మవార్లను మేళతాలాలతో తీసుకెళ్లగా పల్లకీ వెంట మహిళలు హారతులు వెలిగించి పటికబెల్లం నివేదన చేసుకుంటూ ప్రధానాలయానికి చేరుకున్నారు. పీఆర్వో కొండలరావు, సహాయ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు పాల్గొన్నారు. అలాగే రత్నగిరిపై వారాంతపు ఆర్జిత సేవయిన రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది.

భక్తులతో కిక్కిరిసిన రత్నగిరి

సత్యదేవుడి సన్నిధి ఆదివారం పౌర్ణమి పర్వదినం కావడంతో భక్తులతో కిక్కిరిసింది. సెలవు, పౌర్ణమి పర్వదినం, శనివారం రాత్రి రత్నగిరిపై వివాహమాచరించుకున్న జంటలు, వివిధ ప్రాంతాల్లో పెళ్లైన నూతన జంటలతో రద్దీ ఏర్ప డింది. సుమారు 3వేల వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా రూ.40 లక్షల ఆదాయం లభించింది.

ఆలయ సిబ్బందితో నూతన ఈవో సమీక్ష సమావేశం

అన్నవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం నూతన ఈవోగా శనివారం బాధ్యతలు స్వీకరించిన వీర్ల సుబ్బారావు ఆదివారం సాయంత్రం దేవస్థానం అన్ని విభాగాల ఏఈవోలు, సూపరెంటెండెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది పరిచయ కార్య క్రమం అనంతరం దేవస్థానంలో విభాగాల వారీగా రివ్యూ నిర్వహించారు. ఆలయాల అభివృద్ధికి భక్తులే మూలమని, భక్తులకు ఏవిధంగా మరింత మెరుగైన సేవలు అందించగలం, కల్పించాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉదయమే 5గంటలకు అకస్మిక తనిఖీలకు శ్రీకారం చుట్టారు. సన్నిధి బుకింగ్ కౌంటర్, కమాండ్ కంట్రోల్ రూంలను పరిశీలించారు. సెక్యూరిటీ వ్యవస్థపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

తండ్రిని చంపి... బంధువులకు చెప్పి!

పెంపుడు కొడుకు చేతిలో హత్యకు గురైన తండ్రి, ఆస్తి పంచాలని గొడవ

అంతర్వేది, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెంపుడు కొడుకు చేతిలో తండ్రి హత్యకు గురైన సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. కొడుకు రాంబాబు చేతిలో తండ్రి రావి వీరవెంకటనరసింహారావు (75) హత్యకు గురయ్యాడని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో రాంబాబు అనే వ్యక్తి రోజూ ఆస్తి పంచాలని పెంపుడు తల్లిదండ్రులతో గొడవ పడుతూ ఉండేవాడు. అతడి మానసిక స్థితి కూడా సరిగా లేకపోవడంతో శనివారం రాత్రి జరిగిన గొడవలో ప్లాస్టిక్ కుర్చీతో తండ్రి వీరవెంకటనరసింహారావు తలపై కొట్టడంతో చెవి, ముక్కులో నుంచి రక్తం వచ్చింది పడిపోయాడు. అతడి భార్య ఈ గొడవ చూడలేక పక్కింటికి వెళ్లిపోవడంతో వీరవెంకటనరసింహారావును కాపాడేవారు లేకపోవడంతో మృతిచెందాడు. తండ్రిపై హత్యాయత్నానికి పాల్పడిన రాంబాబు బంధువులను పిలిచి విషయం చెప్పడం కూడా ఆశ్చర్యానికి గురిచేసింది. ఆదివారం ఉదయం పోలీసులు, క్లూస్ టీమ్ వచ్చి వీరవెంకటనరసింహారావు మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం రాంబాబును అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. పిల్లలు లేకపోవడంతో వీరవెంకటనరసింహారావు రాంబాబును దత్తత తీసుకున్నాడు. సుమారు 40 ఏళ్లు పెంచి పోషించిన విశ్వాసం కూడా లేకుండా రాంబాబు తండ్రిని హత్య చేయడంతో బంధువులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.



హత్యకు గురైన వీరవెంకటనరసింహారావు



హత్య చేసిన రాంబాబు

పృచ్ఛకుల ప్రశ్నలు.. చమత్కారంగా సమాధానాలు..

పిఠాపురంలో భగవద్గీతపై అష్టావధానం



అష్టావధానంలో ప్రశ్నలకు సమాధానాలిస్తున్న అవధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు

పిఠాపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పృచ్ఛకులు సంధించే ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ, మధ్యలో అసందర్భ ప్రశ్నకలకు చిరునవ్వుతో చమత్కారంగా స్పందిస్తూ భగవద్గీతలోని అంశాలను వివరిస్తూ చేసిన అష్టావధానం ఆసక్తికరంగా సాగింది. కాకినాడ జిల్లా పిఠాపురం శివారులోని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన అవధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు నిర్వహించిన భగవద్గీత అష్టావధానం ఆకట్టుకుంది. పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అధ్యక్షతన జరిగిన ఈ అవధానానికి గురు సహస్రావధాని డాక్టర్ గరిమెళ్ల వరప్రసాద్ సంచాలకులుగా వ్యవహరించారు. పృచ్ఛకులు లింగాల యాజ్ఞవల్క్యశర్మ, జోశ్యుల కృష్ణబాబు, అష్టావధాని కాకరపర్తి దుర్గాప్రసాద్, మార్ని జానకిరామచౌదరి, దాయన సురేష్‌చంద్రజీ, శతావధాని పోచినపెద్ది సుబ్రహ్మణ్యం, డాక్టర్ వేదుల శ్రీరామశర్మ, సూరంపూడి వెంకటరమణలు వ్యవహరించారు. సుమారు 6గంటల పాటు అష్టావధానం సాగింది.

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

అష్టావధానం జరిగిన వేదికపై పురాతన ఆగమశాస్త్ర పద్ధతుల్లో నిర్వహించిన ఆలయ దర్శనం నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ప్రముఖ నాట్యాచారుడు సప్పాదుర్గాప్రసాద్ మార్గదర్శకత్వంలో నటరాజ నృత్యనికేతన్ కళాకారుల ప్రదర్శన వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. పలువురు కవులను, నృత్యప్రదర్శన ఇచ్చిన కళాకారులను డాక్టర్ ఉమర్‌ఆలీషా సత్కరించారు. కార్యక్రమంలో పీఠం ప్రతినిధులు ఆకుల రవితేజ, ఏవీవీ సత్యనారాయణ, ఎన్‌టీవీ ప్రసాదవర్మ, పింగళి ఆనంద్ తదితరులున్నారు.

పాపికొండలకు 18 బోట్లలో పర్యాటకులు



పాపికొండలకు పర్యాటకులతో వెళ్తున్న బోట్లు

వీఆర్‌పురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) పాపికొండలు, పేరంటాలపల్లి విహారయాత్రకు పర్యాటకులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులు పేరంటాలపల్లి, పాపికొండల్లోని ప్రకృతి అందాలను తిలకించేందుకు 18 పర్యాటక బోట్లపై దాదాపుగా 1200 వందల మంది విహారయాత్రకు వెళ్లారు. గోదావరి నది ఒడ్డున ఉన్న ప్రకృతి అందాలను, పాపికొండల అందాలను పర్యాటకులు ఆస్వాదించారు. పేరంటాలపల్లిలోని మునిమఠం (శివాలయం) పర్యాటకులతో కళకళలాడింది. కొండరెడ గ్రా మంలో పండుగ వాతావరణం కనిపించింది. గోదావరి నదిలో 18బోట్లు ఒకేసారి విహారయాత్రకు వెళ్లడంతో పర్యాట కులు ఆనందంగా విహార యాత్ర సాగించి సాయంత్రానికి వెనుతిరి గారు.

విహారయాత్రకు బ్రేక్.. మళ్లీ అనుమతులు

రంపచోడవరం/దేవీపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టు పర్యటన జరగనుండడంతో పాపికొండలు విహారయాత్రకు వెళ్లే పర్యాటక బోట్లను ఆదివారం నిలిపివేశారు. కాగా, సోమవారం కూడా నిలుపుదల చేసినట్టు అధికారులు ముందు ప్రకటించారు. కానీ ఈనెల 16నుంచి పర్యాటక బోట్లకు పూర్తి అనుమతులు ఉన్నవారు యథావిధిగా నిర్వహించుకోవచ్చని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి ఆమె మాట్లాడుతూ సీఎం పర్యటన పోలవరంలో ఉన్నందున అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైసెన్స్ (ముందు జాగ్రత్తచర్యగా) దేవీపట్నంలోని గోదావరి పర్యాటక బోట్లను నిలుపుదల చేశామన్నారు. ఈనెల 16 నుంచి పర్యాటక బోట్లకు సంబంధించిన ప్రభుత్వ అనుమతులు ఉన్నవారు యథావిధిగా నడపవచ్చని, పర్యాటక బోట్లకు పర్యాటకుల భద్రతకు లైఫ్ జాకెట్లు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు.

శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్‌లో కొనసాగిన ఐటీ దాడులు

పెద్దాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో ఆదాయపన్ను శాఖ (ఇన్‌కంట్యాక్స్) అధికారుల దాడులు ఆదివారం కొనసాగాయి. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాస్ ఇళ్లతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి బంధువుల ఇళ్లలో మూడోరోజు ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. ఇప్పటికే సంస్థకు సంబంధించిన పలు కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అలాగే ఐటీ దాడులు సమయంలో లక్షిత వ్యక్తులకు సన్నిహితులైన కొంతమంది అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమా చారం. ఆదివారం వారిని సైతం ఐటీ అధికా రులు గుర్తించి మరింత సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. వాలుతిమ్మాపురం, వడ్లమూరు వెళ్లే రహదారిలో ఉన్న శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ పరిశ్రమల్లో పలు రికార్డులను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

పుష్కర కాలువలో మృతదేహం లభ్యం

గండేపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి మృతదేహం పుష్కర కాలువలో లభ్యమైంది. కాకినాడ జిల్లా గండేపల్లి పోలీసుల వివరాల ప్రకారం... గండేపల్లి మండలం ఉప్పలపాడుకు చెందిన లక్కాకుకల వెంకటేశ్వరరావు(59) ఈనెల 12న ఉదయం బహిర్భూమికి వెళ్లొస్తానని చెప్పి తిరిగి రాలేదు. అయితే ఆదివారం ఉదయం తాళ్ళూరు గ్రామంలో పామాయిల్‌తోట పక్కన పుష్కర కాలువలో వెంకటేశ్వరరావు మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించారు. కేసు నమోదు చేశారు.



వెంకటేశ్వరరావు మృతదేహం

సచివాలయంలో మద్యం బాటిళ్లు

ఇద్దరు వీఆర్వోల నిర్వాకం

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మద్యం బాటిళ్ల బ్యాగ్‌లో పెట్టుకుని సచివాలయానికి తీసుకెళ్లిన ఘటన సంఘటన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం శాటిలైట్ సిటీ గ్రామసచివాలయంలో జరిగింది. ఇద్దరు వీఆర్వోలు వారి క్యాబిన్‌లో మద్యం బాటిళ్లు కలిగి ఉన్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి వెళ్లి తనిఖీ చేయగా వాటిని రైతులు తెచ్చారని బుకాయించే ప్రయత్నం చేశారు. రైతులే మద్యం బాటిళ్లు తెచ్చి ఉంటే వారికి ఏ పని చేయడానికి వీఆర్వోలు మద్యం బాటిళ్లు లంచంగా తెప్పించుకున్నారో వారికే తెలియాలి. బాధ్యత గల వీఆర్వోలు మద్యం బాటిళ్లు కలిగి అది కూడా సచివాయలంలో ఉండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఈ విషయం తెలిసి తహశీల్దార్ వివరణ అడిగినట్టు తెలిసింది. వీఆర్వోలపై కలెక్టర్ ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



మద్యం బాటిళ్లతో ఉన్న బ్యాగ్‌ను లాగుతున్న సిబ్బంది

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

పిఠాపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్‌ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు జరిగాయి. చూపిన ప్రతిభ ఆధారంగా ఏడుగురు క్రీడాకారులను రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేశారు. పిఠాపురంలో ఈనెల 19,20వ తేదిల్లో రాష్ట్రస్థాయి పురుషుల బాక్సింగ్ పోటీల్లో వారు కాకినాడ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. 55కిలోల విభాగంలో జె.నందకిషోర్(తుని), 60కిలోల విభాగంలో ఆర్.దుర్గాఅప్పలరాజు(తుని), 65కిలోల్లో పి.ధనుష్(కాకినాడ), 70కిలోల్లో బి.చిన్ని(తుని), 75కిలోల విభాగంలో జి.శివప్రసాద్(మాధవపురం), 80 కిలోల్లో కె.కిషోర్(తొండంగి), 85కిలోల విభాగంలో వీడీఎస్ శివ(అన్నవరం) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఈ పోటీలను రగ్బీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ వియ్యపు రామన్నరాజు, అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, కేతవరపు కృష్ణ, సోము గోవిందరాజులు ప్రారంభించారు.

అమ్మో పులి!

పులిని చూసి ఆస్పత్రిపాలైన వ్యక్తి

రాజవొమ్మంగి డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో పులి సంచారం ఇక్కడి ప్రజలకు శాపంగా మారిందనే చెప్పాలి. ఈ నెల 2న రాజవొమ్మంగి మండలంలో పులి సంచారంతో ప్రజలు భయపడిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం రాత్రి పులిని చూసి ఓ వ్యక్తి ఆస్పత్రి పాలయ్యాడు. అడ్డతీగల మండలం కినపర్తి గ్రామానికి చెందిన తొంట చిన్నబాబు శనివారం సాయంత్రం పొలానికి వెళ్తూ మార్గమధ్యలో పులిని చూసి బెంబేలెత్తిపోయాడు. భయంతో పొలానికి వెళ్లగా అతడి భార్య చిన్నబాబుకు సపర్యలు చేయగా తిరిగి ఇంటికి వస్తుండగా దూరంగా పెద్దగా శబ్దం రావడంతో స్పృహ కోల్పోయి అడ్డతీగల ప్రభుత్వాసుపత్రిలో చేరాడని గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనపై అటవీశాఖ సిబ్బంది శనివారం, ఆదివారం వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారని, పులి పాదముద్రలు దొరకలేదు. కానీ మరో వ్యక్తి కూడా పులిని చూసినట్టు చెపుతున్నారని ఎఫ్‌ఎస్‌వో అర్జునుడు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

వెంకన్న ఆదాయం రూ.4.87లక్షలు

ఆత్రేయపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,87,726 లభించినట్టు ఈవో తెలిపారు.

ఉపాధి హామీ తనిఖీ గ్రామసభ

కపిలేశ్వరపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వెదురుమూడి పంచాయతీ వద్ద ఆదివారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఎస్‌ఆర్పీ ఇ.కనకారావు మాట్లాడారు. డీఆర్పీ కోటయ్య 2023-24లో గ్రామంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలో సేకరించిన పనుల వివరాల నివేదికను గ్రామసభలో చదివి వినిపించారు.

ఒంటరిదాన్ని చేసి వదిలేస్తారా..

- మొగళ్లమూరు ప్రాథమిక పాఠశాల 2022 జులైలో మూసివేత
- పాఠశాల భవనం రాత్రి వేళల్లో మందు బాబులకు అడ్డాగా
- గ్రంథాలయంగా మార్చాలని వినతి
- ప్రాథమిక పాఠశాల ఆత్మఘోష



మొగళ్లమూరులో మూసివేసిన పాఠశాల భవనం

అల్లవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అమ్మ ఒడిలా ఎందరికో నా ఒడిలో చదువులు నేర్పించాను. నాడు నేను చదువుల తల్లి సరస్వతి నిలయాన్ని మూసివేసి నన్ను ఒంటరిదాన్ని చేసి ఇలా వదిలేస్తారా అధికారులు మీకు ఇది న్యాయమా అంటూ అల్లవరం మండలం మొగళ్మూరు ప్రాథమిక పాఠశాల భవనం కన్నీటితో విలపిస్తోంది. తన ఆత్మఘోష ప్రభుత్వ అధికారులకు చేరాలంటుంది. అల్లవరం మండలం మొగళ్ళమూరు ప్రధాన రహదారి చెంత ఊరి మధ్యలో పాఠశాల భవనం మూసివేయడంతో నిరుపయోగంగా మారింది. కాని పనులకు నిలయంగా తయారైంది. వైసీపీ పాలనలో తక్కువ మంది విద్యార్థులు ఉన్నారనే సాకుతో నన్ను మూసివేశారు. 2022జూలై 1 నుంచి ఈ పాఠశాల భవనం మూతపడింది. నాలాగే సామంతకుర్రు పరిధిలోని గాంధీనగర్‌లో నా సోదరి పాఠశాల మూతపడే ఉంది. మొగళ్ళమూరి పాఠశాల భవనం రాత్రి వేళల్లో మందు బాబులకు అడ్డాగా మారింది. గేటు, భవన తాళాలు పగలకొట్టి ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నారు. అధికారులు అలనా, పాలనా లేక గత పాలనలో నన్ను ఒంటరిదాన్ని చేశారు. నేటి కూటమి పాలనలోనైనా నాకు వెలుగునిచ్చేలా ప్రభుత్వ అధికారులు నున్న పట్టించుకోరా అంటూ ప్రశ్నిస్తోంది. నా గోడు పట్టదా.. చదువులు ఎలాగు ఆపేశారు. జ్ఞానబండాగారంగా గ్రంథాలయంగా మారుస్తారంటూ ఆ భవనం రోదిస్తోంది.

అమరజీవిని స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు
- పొట్టి శ్రీరాములు వర్ధంతి



అమలాపురం: పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు

అమలాపురం టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములును స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. అమలాపురం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి వైశ్య సంఘం ఆధ్వర్యంలో పచ్చిగోళ్ల జనార్దనరావు కల్యాణ మండపంలో అమరజీవి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరజీవి వర్ధంతిని ప్రభుత్వ పరంగా నిర్వహించేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చి త్యాగమూర్తులకు సముచిత గౌరవం కల్పించిందన్నారు. ఆర్యవైశ్యుల కుల దైవమైన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని కూడా ప్రభుత్వపరంగా చేయాలని సంకల్పించినట్టు ఆనందరావు తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి ప్రసాద్, కార్యవర్గసభ్యులు వరదా సూరిబాబు, అప్పన వీరన్న, కూరపాటి మావుళ్లయ్య, కాళ్లకూరి కుమార్, సీనియర్ సిటిజన్ సభ్యులు, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

మలికిపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి, దేశ సమగ్రతకు ప్రతీక భారతరత్న సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసిన మహా పురుషుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని అన్నారు. పటేల్, శ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుండుబోగుల పెద్దకాపు, పినిశెట్టి బుజ్జి, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, పల్లపోతు బంగారం, రావూరి నాగు, ఆకన బాబినాయుడు ఉన్నారు.

శ్రీరాములు కృషి చిరస్మరణీయం

అల్లవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన కృషి చిరస్మరణీయమని ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు గమిడి సూరిబాబు, మోటమర్రి వెంకటరమణ అన్నారు. కొమరగిరిపట్నం, అల్లవరం గ్రామాల్లో ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు నివాళులర్పించారు. ఉద్దగిరి బాబి, మోటమర్రి సుబ్రహ్మణ్యం, మోటమర్రి ప్రకాశరావు, పసలపూడి వినయ్, బలభద్ర కుమార్, రవి, వెదుళ్లపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

మానేపల్లిలో ఘన నివాళి

పి.గన్నవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మానేపల్లిలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెంటపాటి వెంకటేశ్వరరావు, శ్రీకాకుళపు వెంకటేశ్వరావు, నూలు మురళీకృష్ణ, గుగ్గిళ్ల సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అయినవిల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాధనకై ప్రాణాలను తృణప్రాయంగా విడిచిన అమరజీవి శ్రీపొట్టిరాములు వర్ధంతిని ఆదివారం మక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి హెచ్‌ఎం నిమ్మకాయల గణేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు జి.సాయిశ్రీనివాస్, ఎస్.నాగేశ్వరరావు, ఎన్.మేరీగ్రేస్, కె.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ముందుంటుంది

రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

మామిడికుదురు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ముందుంటుందని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య పేర్కొన్నారు. మామిడికుదురు హైస్కూలు ఆవరణలో పీఆర్టీయూ విద్యాకౌన్సిల్ సమావేశం, విద్యా సదస్సు జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వం 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని, హైస్కూళ్లలో పిరియడ్లను తగ్గించాలని, హిందీ, సోషల్, ఇంగ్లీషు సబ్జెక్టులలో సిలబస్ తగ్గించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పదో తరగతి పరీక్షలు వంద రోజుల కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నామని, సెలవు దినాల్లో దీనికి వెసులుబాటు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ట్యాబ్ సిస్టమ్ తొలగించాలని, వర్కు ఎడ్జెస్ట్‌మెంట్ ద్వారా ఉపాధ్యాయులను దూర ప్రాంతాలకు బదిలీ చేయడంపై పునః పరిశీలించి దగ్గర ప్రాంతాలకు బదిలీ చేయాలని సూచించారు. ఎంఈవోలను బదిలీ చేయాలని, ఉపాధ్యాయుల అంతర్‌రాష్ట్ర, జిల్లాల బదిలీలు చేయాలని కోరారు. ప్రస్తుత విద్యారంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం.వెంకన్నబాబు, జిల్లా అధ్యక్షుడు దీపాటి సురేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి కంకటాల చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ పంగం బ్రహ్మాజీరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్, మండల శాఖ అధ్యక్షుడు యాళ్ల పల్లంరాజు, కార్యదర్శి చింతా రమేష్, మండల ఆర్థిక కార్యదర్శి కడలి వెంకటదుర్గాప్రసాద్, ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజనీ తదితరులు పాల్గొన్నారు.

19న ఎస్సీ వర్గీకరణ కమిషన్‌కు వినతులు అందిద్దాం



అమలాపురం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో మాదిగ అనుబంధ కులాల పరిస్థితులను వివరిస్తూ ఈనెల19న కాకినాడ కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్‌కు వినతులు అందించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి పిలుపునిచ్చారు. రోళ్లపాలెంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం ఆకుమర్తి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భైరవమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉండి ఏకసభ్య కమిషన్‌ను నియమించిందన్నారు. మాదిగ అనుబంధ కులాల సమస్యలను మండల, గ్రామస్థాయి నాయకత్వాల్లో కమిషన్‌కు వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు నేదునూరి నతానియేలు, ఖండవిల్లి ఏలియా, సత్తాల దుర్గారావు, నూటుకుర్తి చిన్నా, ఉందుర్తి కిశోర్‌బాబు, సవరపు భీమేష్, మంద దుర్గారావు, సీహెచ్ సత్తిబాబు, ఉండ్రాజవరపు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వారింట మరో కపిల పెయ్యి దూడ జననం



అమలాపురం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అరుదైన కపిల పెయ్యి దూడలు వరుసగా రొక్కం వారి ఇంట ఏటా పుడుతున్నాయి. గ్రామానికి చెందిన అరిగెల వీరభద్రరావుకు దేశవాళీ ఆవులు పెంచడమంటే ఎంతో ఇష్టం. వారింట ఆదివారం మరో పుంగనూరు కపిల పెయ్యి దూడ జన్మించింది. ఇప్పటివరకు వారింట పుంగనూరు ఒంగోలు దూడలు 18 వరకు పుట్టడం విశేషం.

స్థలం లేకుండా తరగతి గదుల నిర్మాణానికి నిధులు

- ఆర్భాటంగా శంకుస్థాపన
- స్థలాభావంతో నిలిచిన పనులు
- వ్యర్థంగా మెటీరియల్



ఎస్.యానాం హైస్కూల్



హైస్కూల్ భవన మెట్ల కింద నిల్వ చేసిన ఐరన్

ఉప్పలగుప్తం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తరగతి గదుల నిర్మాణానికి అక్కడ చోటేలేదు. అయినా ఎస్.యానాం జడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి నాడు-నేడు ఫేజ్-2లో రూ.33లక్షలు మంజూరయ్యాయి. అంతేకాదు ఈఏడాది ఫిబ్రవరి 26వ తేదీన హైస్కూల్‌కు ఎదురుగా ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో అప్పటి మంత్రి పినిపే విశ్వరూప్ గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణం కోసం ఐరన్, ఇటుక కొనుగోలు చేశారు. అయితే నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీనికి కారణం స్థలాభావమే. ఎంపీపీ పాఠశాల ఆవరణలో గదుల నిర్మాణానికి గ్రామస్తుల్లో కొందరు అభ్యంతరం తెలపడంతో నిర్మాణం ఆగిపోయింది. నిజానికి ఆ స్థలం ప్రాథమిక పాఠశాలకు సంబంధించినది కాదని, అక్కడ నిర్మాణం ఎలా చేస్తారన్న అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఇది ఇలా ఉండగా నిర్మాణానికి కొనుగోలు చేసిన ఐరన్ ఆరుబయట ఉండటంతో ప్రస్తుత హెచ్‌ఎం డి.అప్పారావు స్కూల్ భవనం మెట్ల కింద జాగ్రత్త చేశారు. ఇటుక మాత్రం హైస్కూల్‌కు ఎదురుగా నడిరోడ్డు మీద ఉంది. ఇటుకలో పాములు చేరాయంటూ సమీప కుటుంబాలవారు ఆందోళన చెందుతున్నారు. స్థలం లేకుండా నాడు-నేడు నిధులు ఎలా మంజూరు చేశారన్నది ప్రశ్న. నిజానికి హైస్కూల్‌కు అదనపు గదుల అవసరం లేదన్నది వాస్తవం. ప్రస్తుతం గదుల కొరత లేదని హెచ్‌ఎం డి.అప్పారావు తెలిపారు. వ్యర్థంగా ఉన్న మెటీరియల్ మాటేమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు.

మాలల మహాగర్జనకు తరలివెళ్లిన నాయకులు



ముమ్మిడివరం: గుంటూరు తరలివెళుతున్న మాలమహానాడు నాయకులు

ముమ్మిడివరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఏర్పాటుచేసిన మాలల మహాగర్జన సభకు ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి మాలమహానాడు జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం అధిక సంఖ్యలో మాలలు తరలివెళ్లారు. నియోజకవర్గానికి చెందిన మాలమహానాడు నాయకులంతా ముమ్మిడివరం చేరుకుని కాశివానితూము సెంటర్ నుంచి 10ప్రత్యేక బస్సులు, 20కార్లు తదితర వాహనాల్లో భారీగా గుంటూరు తరలివెళ్లారు. రాజ్యాంగ విరుద్ధంగా ఇచ్చిన తీర్పును ఎట్టి పరిస్థితుల్లో మాలలంతా వ్యతిరేకించాలని వారు నినదించారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, వర్గీకరణ వల్ల మాలలకు గానీ, మాదిగలకు ఎటువంటి ప్రయోజనం లేదని, మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టి జాతులను విచ్చిన్నంచేసే కుట్రలో భాగమన్నారు. ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ అనే విధానాన్ని ఉపయోగించి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రిజర్వేషన్లు ఎత్తివేయాలని ప్రయత్నిస్తుందన్నారు. దీనిని మాలలంతా పూర్తిగా వ్యతిరేకిస్తూ గుంటూరులో జరిగే మాలల మహాగర్జన సభలో తమ గళం వినిపిస్తామన్నారు. కార్యక్రమంలో కమిడి ప్రవీణ్‌కుమార్, కాశి జగపతి, దేవరపల్లి ఏడుకొండలు, చీకురుమెల్లి శ్రీను, జనిపల్లి సత్యనారాయణ, మట్టా శ్రీనివాస్, ఎం.ఆశీర్వాదం, బాలకృష్ణ, జనిపల్లి అశోక్, కాశి మూర్తి, కాశి లాజర్, మోకా రామారావు, గుంటూరు శ్రీను, పంతగడ నరసింహమూర్తి, కాశి జగగ్జీవన్‌రామ్, దాసరి వెంకటరమణ, బీర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు నుంచి శ్రేణులు

మామిడికుదురు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరులో జరిగే ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు నాయకులు తలపెట్టిన హలో మాల.. చలో గుంటూరు కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో దళిత నాయకులు ఆదివారం బయలుదేరి వెళ్లారు. మామిడికుదురు నుంచి బయలుదేరిన బస్సులకు మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబులు జెండా ఊపి ప్రారంభించారు మాలమహానాడు నాయకులు, జేఏసీ నాయకులు, అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

16గ్రామాల నుంచి సంఘీయులు

అంబాజీపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరులో జరిగిన మాలల సింహగర్జనకు మండలంలోని 16గ్రామాల నుంచి సంఘీయులు, నాయకులు, యువకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. గుంటూరు తరలివెళ్లిన వారిలో నాయకులు నేలపూడి స్టాలిన్‌బాబు, నాగవరపు నాగరాజు, సర్పంచ్ జల్లి బాలరాజు, పులిదిండి వీరవెంకట సత్యనారాయణ, నెల్లి వెంకటరమణ, చిన్నం బాలవిజయరావు, మైలా ఆనందరావు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మలికిపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఏఎఫ్‌డీటీ హైస్కూలులో 1982-83లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. పూర్వ విద్యార్థులు గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కడలి మెహర్‌ప్రకాష్, దివాకర్, కడలి సత్యసుబ్రహ్మణ్యం, మిరియాల హనుమంతరావు, లింగేలు బాబు, పిప్పళ్ల మాధవి, తులసీదేవి, వీవీఎల్ కుమారితో పాటు విదేశాల్లో స్థిరపడ్డ సుమారు 50మంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాసం ప్రారంభం

అంతర్వేది, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి ధనుర్మాసం ప్రారంభం కావడంతో అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగే ఆర్జిత అభిషేకం తెల్లవారుజామున 4 గంటలకు ప్రారంభమవుతుందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ధనుర్మాసం జనవరి 13వ తేదీ వరకు ఉంటుందని, భక్తులు గమనించాలని కోరారు.

5న విజయవాడలో హైందవ శంఖారావం



హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలంటూ ప్రచారం

అమలాపురం టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జనవరి 5న విజయవాడలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ రాష్ట్ర సత్సంగ్ ప్రముఖ్ రాళ్లపల్లి పాపయ్యశర్మ పిలుపునిచ్చారు. ప్రతీ హిందువు శంఖారావం సభకు తరలి రావాలని అవగాహన కల్పిస్తూ ఆదివారం స్థానిక వడ్డిగూడెంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర భజరంగ్‌దళ్ నాయకుడు శిరంగు నాయుడు ఆధ్వర్యంలో హిందూ దేవాలయాల్లో సమావేశాలు నిర్వహించారు. హిందూ దేవాలయాలను ప్రభుత్వం నుంచి విముక్తి కల్పించాలని డిమాండు చేశారు. దేవదాయ శాఖలో హిందువులనే నియమించాలని, ఆయా ప్రాంతాల్లో నిర్వహించే వ్యాపారాలు హిందువులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రచార కార్యక్రమంలో నగర ప్రముఖ్ ఊటుకూరి సాంబయ్య, ఇళ్ల ఆదిత్య కుమార్, గొవ్వాల రాజేష్, దున్నాల దొరబాబు, పులిమే రాజా, రాయుడు శ్రీ రామచంద్రమూర్తి, కరాటం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాంబాబు



అమలాపురం టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమలాపురం పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబును ఏపీ పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతిలో ఆదివారం జరిగిన 47వ రాష్ట్ర సాధారణ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎమ్మెల్సీ అశోక్‌బాబు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్నికైన రాంబాబును ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, మాజీ ఎంపీ చింతా అనురాధ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు తదితరులు అభినందించారు.

ఘనంగా దత్తాత్రేయస్వామి జయంతి

అంబాజీపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట తహశీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న శ్రీషిర్డిసాయిబాబా ఆలయంలో కొలువుతీరిన శ్రీదత్తాత్రేయ స్వామివారి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు కృష్ణఫణిశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, దత్త హోమం, సహస్ర నామాలతో అభిషేకాలు, హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందించారు. అలాగే మండలంలోని గంగలకుర్రు అగ్రహారం, చిరతపూడి, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, వాకలగరువు, ముక్కామల గ్రామాల్లో దత్తత్రేయస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో స్వామివారిని పల్లకిలో ఊరేగించారు.

ఎమ్మెల్యేను కలిసిన నీటిసంఘాల అధ్యక్షులు, సభ్యులు

ముమ్మిడివరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం, అనాతవరం సాగునీటి సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. పుష్పగుచ్ఛాలతో ఆయనకు అభినందనలు తెలిపి దుశ్శాలువాతో సత్కరించారు. ముమ్మిడివరం నీటిసంఘ అధ్యక్షుడు సరిపల్లి శ్రీనివాసరాజు, ఉపాధ్యక్షుడు బొబ్బిలి ఈశ్వరరావులతో పాటు టీసీలు ఎమ్మెల్యేను కలిశారు. కార్యక్రమంలో దాట్ల పృథ్విరాజ్, దొమ్మేటి రమణకుమార్, గోరింట శ్రీనివాసరాజు, ఎస్వీఆర్కే నాగరాజు, గొల్లపల్లి గోపి, బొబ్బిలి అయ్యప్ప, బొబ్బిలి భరత్, బొబ్బిలి బుజ్జిలతో పాటు పలువురు ఉన్నారు. అలాగే శానపల్లిలంక సాగునీటి సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన జనసేన పార్టీ నాయకుడు గుద్దటి జమ్మిలతో పాటు జనసేన పార్టీ నాయకులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట గోదశి పుండరీష్, దూడల స్వామి, అత్తిలి బాబూరావు, మోకా బాలప్రసాద్, మద్దింశెట్టి పురుషోత్తం, లంకలపల్లి జమ్మి, గాలిదేవర బుజ్జి, గుద్దటి విజయ్, గుద్దటి కన్నబాబు, కూటమి నాయకులు ఉన్నారు.

బాలబాలాజీ స్వామి ఆదాయం రూ.1,46,205



బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి ఆదివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.1,46,205 ఆదాయంగా వచ్చిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. ఆదివారం దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి క్యూలో నిలబడ్డారు. కొత్త, పాత ఆలయాలు భక్తుల కోలాహలంతో ఆహ్లాదకరంగా మారాయి. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

వైభవంగా చండీహోమం

కాట్రేనికోన, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మావుళ్ళమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం చండీ హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆణివిళ్ళ ఫణికాంత్ ఆధ్వర్యంలో భక్తుల సామూహిక నిర్వహణలో ఈకార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గ్రంధి రాంప్రసాద్, ఆణివిళ్ళ సాయిబాబా, గ్రంధి రామకృష్ణపరమహంస, కొత్తగుండు భాస్కరరావు, మంత్రిప్రగడ శ్రీనివాస్, సుంకర బుజ్జి పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

అమలాపురం టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయితో పాటు డివిజన్, మండలస్థాయిల్లో గ్రీవెన్స్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

శ్రీహనుమద్వ్రత నవరాత్రి మహోత్సవాలు

ఈనెల 22 వరకు శ్రీరామ సప్తాహం



చల్లపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో సప్తాహం నిర్వహిస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): టి.చల్లపల్లిలో ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీహనుమద్వ్రత 52వ వార్షికోత్సవ నవరాత్రి మహోత్సవాలు ఈనెల13న ప్రారంభమయ్యాయి. ఈనెల22వ తేదీ వరకు పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. ఆదివారం శ్రీరామ సప్తాహ భజన కార్యక్రమం ప్రారంభించారు. ఈనెల22 వరకు కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ప్రసిద్ధి చెందిన భజన బృందాలు సప్తాహంలో పాల్గొంటున్నట్టు ఆలయ ఈవో కొర్లపాటి సూర్యవెంకటదుర్గ తెలిపారు. కాగా కార్యక్రమం చివరి రోజు శాంతి అభిషేక పూజ జరుగుతుందని వ్యవస్థాపకులు యరగర్త వెంకటేశ్వరరావు, దారపురెడ్డి నాయుడు తెలిపారు. అదే రోజు అఖండ అన్నసమారాధన జరుగుతుందన్నారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని అభిషేక పూజలు నిర్వహించారు.

బీసీ మంత్రుల సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మామిడికుదురు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగే బీసీ మంత్రుల సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోనసీమ జిల్లా బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ కోరారు. ఈనెల19వ తేదీ సాయంత్రం 5గంటలకు విజయవాడ క్లబ్ తాడేపల్లిలో సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేశామని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి అధిక సంఖ్యలో బీసీ ఉద్యోగులు, వర్కింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం ఆధ్వర్యంలో హాజరు కానున్నారని తెలిపారు. కావున బీసీ ఉద్యోగులందరూ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలన్నారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడు రామానుజుల శ్రీనివాస్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కొల్లు గోవింద్ తదితరులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నారన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా వెంకటరమణ



అమలాపురం టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సంచార జాతుల అభివృద్ధి మండలి జిల్లాశాఖ అధ్యక్షుడిగా అమలాపురం పట్టణానికి చెందిన సైదుల వెంకటరమణను నియమించారు. ఈమేరకు అభివృద్ధి మండలి రాష్ట్ర అధ్యక్షుడు అన్నపరెడ్డి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకర మధుసూదన్‌లు నియామక ఉత్తర్వులను అందజేశారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన వెంకటరమణను నగబేరి కృష్ణమూర్తి, బొర్రా మాచరి, నగబేరి వెంకన్నబాబు, బొర్రా శ్రీను అభినందించారు.

కె.జగన్నాథపురంలో దొంగతనం

అయినవిల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కె.జగన్నాథపురంలోని ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు నగలు, నగదు అపహరించుకుపోయారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఓగూరి వెంకటేశ్వరరావు ఈనెల 13న కుటుంబ సమేతంగా శ్రీశైలం దేవ దర్శనానికి వెళ్లారు. ఇంటికి తిరిగి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలోని 40 గ్రాముల బంగారం, నగదును దొంగలు అపహరించుకుపోయారని వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీమ్ ఆధారాలను సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు నగరం ఎస్‌ఐ చైతన్యకుమార్ తెలిపారు.

కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

మామిడికుదురులో భయాందోళనలో ప్రజలు



మామిడికుదురులో కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు

మామిడికుదురు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులో షిర్డిసాయిబాబా గుడి ఎదురుగా విద్యుత్ తీగలు కిందకు వేలాడడంతో ప్రజలు భయాంగోళనలు చెందుతున్నారు. మామిడికుదురు నుంచి ఎన్టీఆర్ కాలనీకి వెళ్లే రహదారిలో కాల్వపై నిర్మించిన వంతెన వద్ద విద్యుత్ తీగలు కిందకు వచ్చి ప్రమాదకరంగా తయారయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గడ్డి ట్రాక్టర్లకు ఈ తీగలు తగులుతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్టర్లపై తరలించే గడ్డికి విద్యుత్ తీగలు తగిలి గడ్డి అంటుకుపోతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత శాఖవారు కిందకు వేలాడుతున్న వైర్లను సరిచేసి ప్రజల భయాందోళనలు తొలగించాలని కోరుతున్నారు.

లంకతల్లెమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు

ముమ్మిడివరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం గ్రామదేవత శ్రీలంకతల్లెమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ముమ్మిడివరం పట్టణంలోని మహిళలు తమ కుమార్తెలతో కుంకుమపూజ జరిపించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పెట్రోలు బంకుల వద్ద తనిఖీ వివరాలుండాలి

యానాం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో పెట్రోలు, డీజిల్ కొట్టే పంపులపై రోజువారీ తనిఖీ వివరాలు తప్పనిసరిగా పొందుపరచాలని యానాం తూనికలు కొలతల శాఖ డిప్యూటీ తహశీల్దారు గణేషణ్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు కచ్చితమైన పరిమాణంలో పెట్రోలు, డీజిల్ నింపుతున్నది లేనిది 5లీటర్లు, 10లీటర్ల డబ్బాలతో వేసి ప్రతి రోజు పరీక్షించాలన్నారు. ఒక బంకులో తనిఖీ చేసిన సందర్భంగా 10లీటర్ల పెట్రోల్‌ను పరిశీలించగా తక్కువ పరిమాణం పెట్రోల్ రావడంతో రూ.5వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న దృశ్యం

వాడపల్లి ఆలయానికి భక్తుల తాకిడి

ఆత్రేయపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.4,87,726 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వెదురుమూడి గ్రామసభలో మాట్లాడుతున్న డీఆర్పీ కోటయ్య

వెదురుమూడిలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ

కపిలేశ్వరపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుమూడి పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ జరిపారు. ఈ గ్రామసభలో ఎస్ఆర్పీ ఇ.కనకారావు పాల్గొని మాట్లాడారు. డీఆర్పీ కోటయ్య 2023-24 సంవత్సరానికి సంబంధించి గ్రామంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలో సేకరించిన పనుల వివరాల నివేదికను తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రసాద్, ఏపీవో రవికిరణ్, జేఈ రజిత్‌సింగ్, టీఏ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్లకు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

న్యాయస్థానం ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే వేగుళ్లకు న్యాయవాదుల వినతి

మండపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండపేటలో న్యాయస్థానం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు న్యాయవాదులు ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. నియోజకవర్గంలో 43 గ్రామాలు, ఒక మున్సిపాల్టీ ఉన్నాయని కోర్టులో కేసులు, న్యాయం కోసం ఆలమూరు వెళ్లాల్సి వస్తున్నదన్నారు. ప్రజల సౌకర్యార్థం ఇక్కడ న్యాయస్థానం ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని ఆయన వారికి తెలిపారు. అనంతరం న్యాయవాదులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వేగుళ్ల రామ్మోహన్, సాయిరాం, బి.దొరబాబు, శాస్త్రి, జోగానందం, డి.జయరాజు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.





పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో విజయదుర్గా అమ్మవారు. పక్క చిత్రంలో పీఠంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

భక్తి శ్రద్ధలతో మార్గశిర పౌర్ణమి పూజలు

రాయవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆదివారం మార్గశిర పౌర్ణమి పూజలు జరిపారు. పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. తొలుత విజయ వేంకటేశ్వరస్వామికి సుప్రభాతసేవ, తులసిదళ అర్చనలు చేశారు. అనంతరం విజయదుర్గా అమ్మవారికి లలితా అష్టోత్తర సహస్ర నామాలు, దుర్గాత్రిశతి, ద్వాత్రింశ నామావళి, లక్ష్మి, సరస్వతి, దుర్గా అష్టోత్తరాలతో కుంకుమ పూజలు, భవాని శంకర సమేత అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం చేశారు. పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్య వెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, పీఆర్వో బాబి, పలువురు భక్తులు పాల్గొన్నారు.



చొప్పెల్లలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

ఆలమూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): చొప్పెల్లలో ఆదివారం పలువురు దివ్యాంగులకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. చొప్పెల్ల తక్షశిల విద్యాలయంలో విభిన్న ప్రతిభావంతుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల వారోత్సవాల్లో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వీల్‌చైర్స్, ఆర్టీసీ బస్సు పాస్‌లను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, చొప్పెల్ల నీటి సంఘం అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, కూటమి నాయకులు అయినవిల్లి సత్తిబాబు, నాగిరెడ్డి వెంకటరత్నం, బళ్ల హరి తదితరులు పాల్గొన్నారు.

మాలలంతా ఐక్యంగా ఉద్యమించాలి

కపిలేశ్వరపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను విడదీసే కుట్రలు చేస్తున్నాయని, సుప్రీంకోర్టు తీర్పును తిప్పికొట్టేందుకు మాలలంతా ఐక్యంగా ఉద్యమించాలని పలువురు మాలమహానాడు నాయకులన్నారు. ఆదివారం మండలంలోని పడమరఖండ్రిక, నల్లూరు గ్రామాల నుంచి ఛలో గుంటూరు మాలల మహాగర్జన సభ కార్యక్రమానికి మాలసంఘ పెద్దలు, యూత్ సభ్యులు వెళ్లారు. ఈసందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలకు వారు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మాలలకు వ్యతిరేకంగా మందకృష్ణను అడ్డుపెట్టుకుని కోర్టులను ప్రభావితం చేస్తూ ఎస్సీ వర్గీకరణ చేసేందుకు తాపత్రయపడుతున్నాయని ఆరోపించారు. మాలల ఐక్యత, వారి పరిరక్షణకు గుంటూరులో జరిగే మాలల గర్జన సభకు వెళుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సాకా శ్రీను, నేల సూర్యకుమార్, కని కెళ్ల శ్రీను, వి.సుబ్బారావు, ఎస్.శ్రీను, ఎం.రమేష్, ఎం.నాగభూషణం, పి.రమేష్, ఎం.శ్రీను, జి.సూర్యారావు, మాల సంఘం నాయకులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాలల సంఘం నాయకులు, యూత్ సభ్యులు



రామచంద్రపురంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్



ఆలమూరులో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మహిళలు



మండపేటలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు

నేడు మండల సమావేశం

మండపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ఎంపీపీ ఉండమట్ల వాసు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

అమరజీవి ప్రాణత్యాగం వెలకట్టలేనిది

పొట్టి శ్రీరాములు విగ్రహానికి మంత్రి సుభాష్ నివాళి

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాంది పలికారని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్థంతిని పురస్కరించుకుని రామచంద్రపురం కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు వర్థంతిని ప్రభుత్వం ఆత్మార్పణ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఈయన పోరాట పటిమ, ఆదర్శ భావాలు నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో: ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు వర్థంతిని జరిపారు. జిల్లా సైన్సు అధికారి గిరిజాల సుబ్రహ్మణ్యం పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సోషల్ ఉపాధ్యాయురాలు శనివారపు పాపాయి, లవ్ టు సర్వ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలమూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్థంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిపారు. గాంధీ బొమ్మ సెంటర్లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలమూరు కూటమి నాయకులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండలంలోని పలు గ్రామాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్థంతిని జరిపారు. ఆత్రేయపురం, ర్యాలి, అంకంపాలెం తదితర గ్రామాల్లోని పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పలువురు నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వర్థంతిని జరిపి, వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు.

అమరజీవి త్యాగనిరతి వెలకట్టలేనిది

ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: తెలుగు రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన ఘనత అమరజీవి పొట్టి శ్రీరాములుకు దక్కుతుందని అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు, పట్టణానికి చెందిన వైశ్య ప్రముఖులతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు, మున్సిపల్ కౌన్సిలర్ కాళ్లకూరి స్వరాజ్య భవాని, వాకచర్ల గుప్త తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం ఎనలేనిదని వక్తలన్నారు. ఆదివారం మండలంలోని అంగరలో పొట్టి శ్రీరాములు వర్థంతి సందర్భంగా జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం పొట్టి శ్రీరాములు విగ్రహానికి వక్తలు నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగర సాగునీటి సంఘం అధ్యక్షుడు కొమ్మిశెట్టి సూరిబాబు, ఉపాధ్యక్షుడు తోరాటి శ్రీను, చీకట్ల గంగరాజు, కొంపెల్ల రాంబాబుశర్మ తదితరులతో పాటు అంగర, పడమరఖండ్రిక జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: అమరజీవి పొట్టి శ్రీరాములకు భారతరత్న ప్రధానం చేయాలని గాంధీ అధ్యయన సంస్థ అధ్యక్షుడు దుళ్ల వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్థంతిని పురస్కరించుకుని పలివెలలో గాంధీ అధ్యయన సంస్థ, వాసవి సేవా సంస్థ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు జరిపి పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంకటాల శ్రీరామ్మూర్తి, కంకటాల పెదబాబు, జి.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: మండలంలో పొట్టి శ్రీరాములు వర్థంతిని జరిపారు. వెదిరేశ్వరం జడ్పీ పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం కె.ఈశ్వరరెడ్డి, పాఠశాల చైర్మన్ మారే సుబ్బాయమ్మ, పలువురు ఉపాధ్యాయులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.





కపిలేశ్వరపురం మండలం అంగరలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు. పక్క చిత్రంలో కొత్తపేట మండలం పలివెలలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నేడు అగస్త్యేశ్వరస్వామికి అన్నాభిషేకం

మండపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోనున్న అగస్త్యేశ్వరస్వామికి మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని అన్నాభిషేకం నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నామని భక్తులు ఈ పూజల్లో పాల్గొనాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో దత్త జయంతి

మండపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం దత్త జయంతిని జరిపారు. పట్టణంలో నాలుగు గుడుల వద్ద, తర్వాణిపేట సాయిబాబా ఆలయం వద్ద దత్త జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కె.గంగవరంలో పూజలు చేస్తున్న భక్తులు

కె.గంగవరం: మండలంలోని పాణంగిపల్లి షిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం దత్త జయంతిని ఘనంగా జరిపారు. దత్తాత్రేయుడికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దత్తాత్రేయుడిని దర్శించుకున్నారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

రాఘవన్‌ను పరామర్శించిన ఎంపీ బోస్

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పితృ వియోగం పొందిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్‌ను ఆదివారం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ పరామర్శించారు. విశ్రాంత అధ్యాపకుడు సత్యనారాయణ చౌదరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఇంత సంతోషం, మాజీ కౌన్సిలరు శీలం గంగరాజు పరామర్శించారు.

నేటి నుంచి ధనుర్మాసం ప్రారంభం

అంతర్వేది, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి ధనుర్మాసం ప్రారంభం కావడంతో అంతర్వేదిలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగే ఆర్జిత అభిషేకం తెల్లవారుజామున 4 గంటలకు ప్రారంభమవుతుందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. జనవరి 13 వరకు ధనుర్మాసం ఉంటుందన్నారు.



సాగునీటి సంఘ అధ్యక్షులు, సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కూటమి నేతలు

రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

మండపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్షులు, సంఘ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మండపేట పార్టీ కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గ పరిధిలో సాగునీటి సంఘాల అధ్యక్షులు, సభ్యు లను వేగుళ్ల అభినందించి రైతు సమస్యల పరిష్కారానికి సంఘాలు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సభ్యులు ఆయన్ను పూలమాలలు శాలువా లతో సత్కరించారు. మండపేట సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పసల శ్రీనివాసరావును ఎమ్మెల్యే వేగుళ్ల, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, సహకార సంఘ మాజీ అధ్యక్షుడు మల్లిపూడి గణేష్ తదితరులు అభినందించారు.



హైదరాబాద్‌లో తెలుగు ప్రతిభా పురస్కారాలు అందుకుంటున్న షిర్డీసాయి విద్యానికేతన్ విద్యార్థులు

షిర్డీసాయి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఆలమూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన తెలుగు, హిందీ ప్రతిభా పోటీల్లో చెముడులంక శ్రీషిర్డీసాయి విద్యానికేతన్ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయస్థానాలు లభించాయి. తెలుగులో నంద్యాల నవ్యతేజశ్రీ ప్రథమ, హిందీలో కంభపాటి తనుష్క ద్వితీయస్థానంలో నిలిచారు. వీరికి హైదరాబాద్‌లో జరిగిన జరిగిన కార్యక్రమంలో గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ్‌తోపాటు పలువురు ప్రముఖుల నుంచి నగదు, మెమెంటో, ప్రశంసాపత్రం అందుకున్నారు. బహుమతులు పొందిన విద్యార్థినులను షిర్డీసాయి విద్యానికేతన్ డైరెక్టర్ ఉమారాణి, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.





రామానుజన్ గణిత అవార్డు అందుకుంటున్న మూర్తి. పక్క చిత్రంలో సంజీవరాయశర్మ అవార్డు అందుకుంటున్న శ్రీధర చంద్రశేఖరశాస్త్రి

గణితశాస్త్ర ప్రావీణ్యంతో ఉన్నతస్థితి

రామానుజన్, సంజీవరాయశర్మ గణిత అవార్డుల ప్రధానం

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గణితశాస్త్రంలో ప్రావీణ్యం సాధించడం ద్వారా ఉన్నతస్థితికి చేరుకోవచ్చని ఐఐటి ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ డాక్టర్ పీవీఎస్ఎన్ మూర్తి అన్నారు. ఆదివారం వీఎస్ఎం కళాశాలలో రామానుజన్ గణిత అకాడమీ 35వ వార్షికోత్సవ సభ జరిగింది. గతంలో రామానుజన్ గణిత అకాడమీ ప్రకటించిన రామానుజన్ గణిత అవార్డును ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ పీవీఎస్ఎన్ మూర్తికి అందించారు. సంజీవరాయశర్మ గణిత అవార్డును మేథ్స్‌ల్యాబ్ డిజైనర్ శ్రీధర చంద్రశేఖర శాస్త్రికి అందించారు. కొప్పిశెట్టి కృష్ణమూర్తి అవార్డు రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత అధ్యాపకురాలు వైప ధ్వజకు అందించారు. అవార్డు గ్రహీతలు ప్రొఫెసర్ పీవీఎస్ఎన్ మూర్తి, శ్రీధర చంద్రశేఖరశాస్త్రి, కె.కృష్ణమూర్తి అవార్డు గ్రహీత వైప ధ్వజ మాట్లాడారు. ముందుగా రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాప అధ్యక్షుడు డాక్టర్ కెవీవీ సత్యనారాయణ మాట్లాడారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో నిర్వహించిన గణితపోటీ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీఎస్‌వీఎస్ సూర్యనారాయణ, తోటకూర సాయిరామకృష్ణ, ఎం.నాగార్జున, కె.శ్రీకృష్ణసాయి, గూడుపు వసంతకుమార్, పీవై వెంకటరావు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

అమలాపురం టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు.

గుంటూరు సభకు సంఘీయులు

ఆత్రేయపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరులో జరిగిన మాలల మహాగర్జనకు సంఘీయులు వెళ్లారు. ఆదివారం అక్కడి గర్జనకు మండలంలోని 17 గ్రామాల నుంచి కార్లు, బస్సులు, మోటార్ సైకిళ్లపై ఊరేగింపుగా వెళ్లారు. తొలుత గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఊరేగింపుగా గర్జన సభకు వెళ్లారు.

పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడిగా కృష్ణకుమార్



నరాల కృష్ణకుమార్

కె.గంగవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడిగా కె.గంగవరం మండలం బాలాంత్రం ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరాల కృష్ణకుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం మామిడికుదురులో జరిగిన జిల్లా కౌన్సిల్ ఎన్నికల్లో నరాల కృష్ణకుమార్‌ను ఎన్నుకున్నారు. కోనసీమ జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

నీటి వినియోగదారుల సంఘం డైరెక్టర్లకు సత్కారం

రాయవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత కొవ్వూరి నాగిరెడ్డి అనపర్తి నియోజకవర్గం కొంకుదురు నీటి వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా పలువురు టీడీపీ నేతలు ఆదివారం సత్కరించారు. వెదురుపాక గ్రామానికి చెందిన కటారి రామకృష్ణ పసలపూడి నీటి వినియోగదారుల సంఘం డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. అనపర్తి మండలం పొలమూరు నీటి వినియోగదారుల సంఘం డైరెక్టర్‌గా మీనవిల్లి వీరవెంకట సుబ్బారావు చౌదరి నీటి వినియోగదారుల సంఘం డైరెక్టర్లుగా ఎంపికైన సందర్భంగా వారిని టీడీపీ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కొవ్వూరి చంటిరెడ్డి, వడ్డాది చిన్నకృష్ణంరాజు, మాజీ వైస్ ఎంపీపీ సత్తి హిమరాణి సావిత్రిదేవి తదితరులు అభినందించారు.

మానవత ఆశ్రమంలో యోగ, సూర్య నమస్కారాల పోటీలు

రాయవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని లొల్ల విశ్వమానవత ఆశ్రమంలో ఆదివారం విద్యార్థులకు యోగా, సూర్య నమస్కారాలు, గీతా శ్లోకాలపై పోటీలు జరిపారు. మానవత సంస్థ అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత రాయవరం, రాజమహేంద్రవరం, కాకినాడ, జి.మామిడాడ తదితర ప్రాంతాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవద్గీత చదివి ధర్మ మార్గంలో జీవించాలని పిలుపునిచ్చారు. తొలుత అల్లూరి వరలక్ష్మి వర్థంతిని పురస్కరించుకుని గర్భిణులకు వైద్య పరీక్షలు, గ్రామస్తులకు హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. యోగా, సూర్య నమస్కారాలు, గీతా శ్లోకాలపై విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి, వలంటరీ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెలగల ఫణికృష్ణారెడ్డి, లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి, మానవత ప్రతినిధులు రామచంద్రరావు, డాక్టర్ సత్యనారాయణ, వీరభద్రరావు, ప్రకాష్, సుజాత, యామిని తదితరులు పాల్గొన్నారు.